సాక్షి
రంగారెడ్డి
శనివారం : 26 : జూలై : 2025



కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 8లో▸



ప్రమాదకరంగా వంతెన

కొందుర్గు మండలం వెంకిర్యాల వంతెన నిర్మాణం పనులు అర్ధతరంగా నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారింది. 8లో▸



అనుమతుల్లేని క్లినిక్‌ల సీజ్

జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న పలు ఆస్పత్రులను సీజ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

040-23237416

కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయని, ఇంకా 48 గంటలు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ చేసిన సూచన మేరకు జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కడైనా వరదలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయ, సహకారాలు అందించడానికి కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో, బాధితులు సహాయం కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్: 040-23237416కు కాల్ చేయొచ్చని, వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి సహాయం అందిస్తుందని వివరించారు. టోల్ ఫ్రీ నంబర్ 24 గంటలు పనిచేస్తుందన్నారు.

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

హాజరుకానున్న మంత్రి శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్: రెవెన్యూ మండల పరిధిలో నూతనంగా ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ కార్డులను శనివారం ఐటీ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయనున్నట్లు తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలోని తారా కన్వెన్షన్ హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి లబ్ధిదారుల హాజరు కావాలని సూచించారు.

ఆయిల్‌పామ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేష్

మాడ్గుల: రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సురేష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీజన్‌లో వరి వేస్తే మరో సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచించారు. ఆయిల్‌పాం సాగులో మూడేళ్ల పాటు కష్టపడితే 30 సంవత్సరాల వరకు నికర ఆదాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీపీడీ నీరజ్ గాంధీ, మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

చటాన్‌పల్లి వద్ద ఫ్లైఓవర్‌కు గ్రీన్‌సిగ్నల్



రైల్వేగేటు వద్ద అధికారులు, నాయకులు

షాద్‌నగర్: పట్టణంలోని చటాన్‌పల్లి వద్ద ఉన్న రైల్వే గేటుపై ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులు, నాయకులు పరిశీలించారు. రూ.184 కోట్లు వెచ్చించి వై ఆకారంలో ఫ్లైఓవర్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య తీరుతుందన్నారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈ రవీందర్, కాంట్రాక్టర్లు సందీప్‌కుమార్, టీవీరావు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇక చచ్చినా పార్టీ మారను

చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్: అధికారం ఉంటే ప్రజలకు సేవ చేయొచ్చని గతంలో పార్టీలు మారాను.. బీజేపీలో చేరినప్పుడు మళ్లీ ఎప్పుడు మారుతాడోనని చాలామంది మాట్లాడుకున్నారు.. ఇక చచ్చినా మారను.. కడదాకా బీజేపీలోనే ఉంటానని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మొయినాబాద్‌లోని పద్మావతి గార్డెన్‌లో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ మండల కార్యకర్తల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి పాపారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, కంజర్ల ప్రకాష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ననువెల్లి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఊరు.. పట్టించుకోరు!

పల్లెలు సమస్యల లోగిళ్లలో కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోలేకపోతున్నాయి. పాలక మండళ్ల రద్దై ఏడాదిన్నర కావొస్తున్నా.. ఇప్పటి వరకు కొత్తవి ఏర్పాటు కాకపోవడం, ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు గ్రామాల ముఖం చూడకపోవడం, ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు కాకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి.



నందిగామ: పేరుకుపోయిన చెత్తకుప్పలు



షాబాద్: ఎర్రోనిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి

పడకేసిన పల్లెలు

- అస్తవ్యస్తంగా మురుగునీటి పారుదల వ్యవస్థ
- గుంతలు తేలిన రహదారులు
- పేరుకుపోయిన చెత్తకుప్పలు
- లోపించిన పారిశుద్ధ్యం
- దృష్టిసారించని ప్రత్యేకాధికారులు



కొత్తూరు: రోడ్డుపై పారుతున్న మురుగునీరు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం స్పష్టంగా కన్పిస్తోంది. ఏ వీధిలోకి తొంగి చూసినా చెత్త గుట్టలే దర్శనమిస్తున్నా యి. చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు, ట్రాలీలు ఏర్పాటు చేసినప్పటికీ డీజిల్ ఖర్చులకు నిధులు మంజూరు చేయకపోవడంతో కార్యదర్శులు, గ్రామస్తులు కలిసి చందాలు వేసుకుని పని చేయించాల్సిన దుస్థితి నెలకొంది. కొత్తగా డ్రైనేజీ కాల్వలు నిర్మించకపోవడంతో ఏకధాటి వర్షాలకు ఇళ్ల మధ్యే డ్రైనేజీ పొంగి ప్రవహిస్తోంది. రోజుల తరబడి ఫాగింగ్ చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రిపూట కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పాడైపోయిన వీధిదీపాలను మార్చకపోవడంతో కాలనీల్లో అంధకారం అలముకుంటోంది. విషకీటకాల భయంతో పల్లెవాసులు రాత్రిపూట కాలు బయట పెట్టేందుకే జంకుతున్నారు.

గుంతలు తేలిన మట్టి రోడ్లే దిక్కు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో 1,166.629 కిలోమీటర్ల మేర రోడ్ల విస్తీర్ణం ఉంది. దీనిలో 66.50 కిలోమీటర్లు రాష్ట్ర రహదారులు, 706.365 కిలోమీటర్ల జిల్లా ప్రధాన రహదారులు, 393.714 కిలోమీటర్ల గ్రామీణ రహదారులు ఉన్నాయి. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో 3,731.92 కిలోమీటర్ల రోడ్లు ఉండగా, వీటిలో 234 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 1,678 కిలోమీటర్ల తారు రోడ్లు, 334 కిలోమీటర్ల కంకర రోడ్లు, 578 కిలోమీటర్ల మొరం రోడ్లు, 908 కిలో మీటర్ల మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాలకు తోడు భారీ వాహనాల రాకపోకలతో మెజార్టీ రోడ్లు దెబ్బతిన్నాయి. గుంతలను పూడ్చకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మెజార్టీ గ్రామీణ ప్రజలు కంకర, మొరం, మట్టి రోడ్లపైనే ప్రయాణం సాగిస్తున్నారు.

ఇళ్ల మధ్య మురుగు పరుగు

గ్రామీణ ప్రాంతాల్లో 210.71 కిలోమీటర్ల ఓపెన్ డ్రైనేజీ కాల్వలు ఉండగా, 1,320.19 కిలోమీటర్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విస్తరించి ఉంది. గ్రామ శివారు ప్రాంతాల్లోని మెజార్టీ కాలనీల్లో సరైన మురుగునీటి పారుదల వ్యవస్థ లేదు. కచ్చ కాల్వలే దిక్కవుతున్నాయి. ఈ కాల్వల విస్తీర్ణం 192.04 కిలోమీటర్లు ఉన్నట్లు అంచనా. వీధుల్లో మురుగు నీరు పారుతోంది. ఏకధాటి వర్షాలు, వరదలకు ఇంటి ముందు నీరు నిల్వ ఉండి దోమలు, ఈగలకు నిలయంగా మారుతున్నాయి.

డీజిల్ ఖర్చులకు దిక్కులేదు

జిల్లావ్యాప్తంగా 236 వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు సహా 259 డంపింగ్ యార్డ్‌లు, 493 వర్మీ కంపోస్ట్ కేంద్రాలు ఉన్నట్లు అంచనా. నిర్వహణ లోపంతో వీటిలో మెజార్టీ కేంద్రాలు పని చేయడం లేదు.

జిల్లాలోని పల్లెల స్వరూపం	
మండలాలు	27
జెడ్పీటీసీలు	21
ఎంపీటీసీలు	230
పంచాయతీలు	526
మొత్తం ఓటర్లు	7,94,653

వీధుల్లో చెత్తను తరలించేందుకు 555 ట్రాక్టర్లు, 1,073 ట్రాలీలు, 549 ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. జీపీల వద్ద డీజిల్ ఖర్చులకు నిధులు లేక కార్యదర్శులు అప్పులు చేయాల్సి వచ్చింది. మంచినీటి బోర్ల రిపేర్లకూ ఇబ్బందులు తప్పడం లేదు. 53 కమ్యూనిటీ టాయ్‌లెట్స్, 28 షీ టాయ్‌లెట్లను ఏర్పాటు చేసినప్పటికీ ఎందుకూ పనికి రాకుండా పోయాయి. వైకుంఠధామాలు నిరుపయోగంగా మారాయి. వర్మీ కంపోస్టు కేంద్రాలు పూర్తిగా పని చేయడం లేదు.

పిచ్చి మొక్కలతో క్రీడా ప్రాంగణాలు

జిల్లా వ్యాప్తంగా 1,267 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. వాటి ముందు కేవలం బోర్డులు పెట్టి వదిలేశారు. ఊరికి దూరంగా, నిర్వహణ లోపంతో అవి పిచ్చి మొక్కలకు నిలయంగా మారాయి. 766 పల్లె ప్రకృతి వనాలు, 52 బృహత్ పల్లె ప్రకృతి వనాలు, 536 నర్సరీలు ఉన్నాయి. వేసవిలో నీళ్లు పోయకపోవడంతో మెజార్టీ మొక్కలు చనిపోయాయి. రక్షణ లేక ఏపుగా పెరగాల్సిన మొక్కలు విరిగిపోయి కన్పిస్తున్నాయి.



తరగతి గదిలో ఊడిపోతున్న పై పెచ్చులు

❖ ఇదీ తరగతి

యాచారం మండలం మంతన్‌గౌరెల్లి ప్రాథమికోన్నత పాఠశాల శిథిలావస్థకు చేరింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తరగతి గదుల్లోని పై పెచ్చులు ఊడి పడిపోతున్నాయి. పాఠశాలలో దాదాపు వంద మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం సాగిస్తున్నారు. ఎప్పుడు ఏమవుతుందోనని ఇటు విద్యార్థులు, అటు తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలతో గదిలోకి నీళ్లు వచ్చి విద్యార్థులకు భోజనం వండి పెట్టలేని పరిస్థితి నెలకొంది.

– యాచారం



శిథిలావస్థకు చేరిన తరగతి గది కిటికీ

బీసీల పేరుతో డ్రామాలు



రాంచందర్‌రావును గజమాలతో సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- కాంగ్రెస్ నేతల దుష్ప్రచారాన్ని నమ్మొద్దు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

బడంగ్‌పేట్: బీసీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతోందని, బీసీల పేరుతో ముస్లింలకు కేటాయిస్తున్న రిజర్వేషన్ ఎత్తివేస్తే బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ పార్టీ కార్యాలయానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుని హోదాలో మొదటిసారి అడుగుపెట్టిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ బీసీలకు వ్యతిరేకం అని కాంగ్రెస్ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. తమది అందరి పార్టీ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో మెజారిటీ స్థానాలు గెలుచుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరస్తు.. శుభమస్తు

ప్రారంభమైన శుభ ముహూర్తాలు

- ఒక్కటి కానున్న వందలాది జంటలు
- అనుబంధ వ్యాపారులకు డిమాండ్



షాద్‌నగర్: శ్రీరస్తూ.. శుభమస్తూ.. శ్రీకారం చుట్టుకుంది పెళ్లి పుస్తకం.. ఇక ఆకారం దాల్చుతుంది కొత్త జీవితం అన్నట్లు శ్రావణమాసం రాకతో ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఇక పెళ్లి బాజాలు మోగనున్నాయి.

మంచి ముహూర్తాలు

మూఢంతో గత మే 24 నుంచి శుభముహూర్తాలు లేవు. పెళ్లిళ్లు, గృహప్రవేశాలకు అంతా దూరంగా ఉన్నారు. శ్రావణ మాసం ప్రారంభంతో ఆగిపోయిన శుభకార్యాలు మళ్లీ మొదలయ్యాయి. ఈనెల 26, 30, 31, ఆగస్టు 1, 3, 4, 6, 10, 13, 15, 17, 18 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆగస్టు 24 నుంచి భాద్రపద మాసం ప్రారంభం కానుంది. ఈ నెలలో శుభకార్యాలు నిర్వహించరు. ఆ తర్వాత వచ్చే ఆశ్వయుజ, కార్తీక మాసాలు శుభకార్యాలకు శ్రేష్టమైనవి. అంటే అక్టోబర్ 4, 8, 16, 24, 31, నవంబర్ 1, 7, 22, 23, 25, 29 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. శుభముహూర్తాలు ఉండటంతో జిల్లా వ్యాప్తంగా వందలాది జంటలు ఒక్కటి కానున్నాయి.

వ్యాపారాల జోరు

పెళ్లిళ్ల సీజన్ కావడంతో అనుబంధంగా ఉండే వ్యాపారాలు జోరందుకోనున్నాయి. పురోహితులే ముహూర్తాలు ఖరారు చేయనుండడంతో ముఖ్యమైన రోజుల్లో వారు బిజీగా మారారు. ఇప్పటికే పురోహితులు, ఈవెంట్లు, పెళ్లి పత్రికల ముద్రణ, మండపాలు, క్యాటరింగ్, బాజా, సన్నాయి మేళాలు, డెకరేషన్, డీజే, టెంట్‌హౌస్ నిర్వాహకులు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు భారీగా డిమాండ్ పెరిగింది. రెండు, మూడు నెలల ముందే బుకింగ్ చేసుకుంటున్నారు.

బంగారం ధరలతో బెంబేలు

బంగారం పేరు వింటేనే గుండె గుబిల్లుమంటోంది. సామాన్యులకు అందనంత దూరంలో ధర పెరుగుతూ వెళ్తోంది. శుభకార్యాలు, పెళ్లిళ్లు ఉండడంతో పసిడి మరింత ప్రియం కానుందని వ్యాపారులు చెబుతున్నారు. బంగారంతో పాటు వెండి ధరలు సైతం పెరుగుతున్నాయి. వివాహాల్లో ఆభరణాలు తప్పనిసరి కావడంతో కొనుగోలు తప్పడం లేదని పలువురు అంటున్నారు.

“ శుభకార్యాల మాసం



శ్రావణ మాసం ఎంతో పవిత్రమైన మాసం. ఈ మాసంలో ఎన్నో దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయి. మంచి ముహూర్తానికి ఎక్కువ మంది పెళ్లిళ్లు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. వేదమంత్రాల సాక్షిగా వేలాది జంటలు ఒక్కటి కానున్నాయి.

– రవిశర్మ, పురోహితుడు, షాద్‌నగర్

పెరుగుతున్న ఖర్చులు

కలకాలం నిలిచిపోయే వివాహ వేడుకను ఘనంగా నిర్వహించేందుకు కొందరు పెళ్లిళ్ల కోసం ఈవెంట్ ఆర్గనైజర్లను ఆశ్రయిస్తున్నారు. అందరూ మెచ్చేలా.. గుర్తుంచుకునేలా వేడుకను నిర్వహించాలని ఫంక్షన్ హాళ్లలో ఆర్భాటంగా వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసే మండపం, భోజనాలు, బ్యాండ్, వచ్చిపోయే బంధువులకు మర్యాదలు, ఫొటోలు, వీడియోలకు పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్నారు.

సమాజంలో యువత పాత్ర కీలకం



యాంటీ నార్కోటిక్స్ ఎస్పీ సీతారాంని సన్మానిస్తున్న ఇక్ఫాయ్ బృందం

శంకర్‌పల్లి: సమాజంలో యువతది కీలక పాత్ర అని, చదువుకునే సమయంలోనే తమ భవిష్యత్తును ఎంచుకోవాలని యాంటీ నార్కోటిక్స్ ఎస్పీ సీతారాం అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పది రోజుల పాటు నిర్వహించిన దీక్షారంభ్ ముగింపు వేడుకలకు శుక్రవారం హాజరైన ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలు తీసుకొని బంగారు భవిష్యత్తును చిత్తు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ వీసీ ఎల్.ఎస్.గణేశ్, లా స్కూల్ ప్రొ. రవిశేఖర రాజు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌భూపాల్‌గౌడ్

షాద్‌నగర్‌రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు పిట్టలసురేష్ ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యశాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజ్‌భూపాల్‌గౌడ్ మాట్లాడుతూ.. త్వరలో నిర్వహించనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ పదవులను కైవసం చేసుకునే విధంగా సమన్వయంతో పని చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించాలని అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్ట పడితే విజయం మనదేనని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జి ఇస్నాతి శ్రీనివాస్, బీజేవైఎం నాయకుడు వంశీకృష్ణ, నాయకులు ఎంకనోళ్ల వెంకటేశ్, లక్ష్మణ్‌నాయక్, శ్యాంసుందర్‌రెడ్డి, రఘుగౌడ్, గణేశ్, నర్సింలు, వెంకటేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగు చట్టాలపై అవగాహన అవసరం

రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్



చిన్నషాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న సునీల్, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల/మొయినాబాద్: భూ హక్కులు, సాగు చట్టాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్ అన్నారు. రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో లీప్ సంస్థ సహకారంతో చేపడుతున్న 'సాగు న్యాయ యాత్ర'లో భాగంగా శుక్రవారం మొయినాబాద్ రైతు వేదికలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సాగు భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా భూ భారతిలో దరఖాస్తు చేసుకుని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. నకిలీ విత్తనాలు, నాణ్యతలేని ఎరువులతో నష్టపోతే చట్టాలను ఉపయోగించుకోవాలని సూచించారు. మార్కెట్ అన్యాయాలు, పంటల బీమా సమస్యల పరిష్కారానికి న్యాయ సలహాలు తీసుకోవచ్చన్నారు. రైతులకు న్యాయ సహాయం అందించేందుకే 'సాగు న్యాయ యాత్ర' చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం చిన్నషాపూర్‌లో కూరగాయ పంటలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైతుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రైతు సంక్షేమ కమిషన్ ఓఎస్డీ హరి వెంకటప్రసాద్, శ్రావణి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీకాంత్, చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు, ఏఓ అనురాధ, ఏఈఓలు సునీల్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు చట్టాల గురించి తెలుసుకోవాలి

రైతులకోసం పనిచేసే చట్టాల గురించి రైతులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం రైతు సాగు న్యాయ యాత్ర కార్యక్రమంలో భాగంగా భూమి సునీల్ సారథ్యంలోని లీప్స్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు భూ భారతి చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సాగు యాత్రతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సునీల్ మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై ప్రతి రైతుకీ అవగాహన కల్పించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. కార్యక్రమంలో భూదాన్ మాజీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్, మార్కెట్‌కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, టీపీసీసీ నాయకులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి మహిళ మృతి


సుశీల (ఫైల్)

పహాడీషరీఫ్: బైక్ అదుపు తప్పి కింద పడటంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రావిరాలకు చెందిన దార సుశీల (55) ఆర్సీఐ రోడ్డులోని విజయ డెయిరీలో స్వీపర్‌గా పనిచేస్తోంది. రోజూ మాదిరిగానే నడుచుకుంటూ విధులకు వెళ్తున్న ఆమె.. బైక్‌పై అటుగా వెళ్తున్న ఓ యువకుడిని లిఫ్ట్ అడిగింది. ఇద్దరూ కొద్దిదూరం వెళ్లగానే అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి వాహనం అదుపు తప్పింది. బైక్ పైనుంచి కిందపడిన సుశీల తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విధులకు వెళ్లిన యువతి అదృశ్యం


భవాని (ఫైల్)

పహాడీషరీఫ్: విధులకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరామ కాలనీకి చెందిన మహదేవరెడ్డి చిన్న కూతురు ఎం.భవాని(20) కాటేదాన్‌లోని ఓ ప్లాస్టిక్ కంపెనీలో పని చేస్తోంది. రోజూ మాదిరిగానే ఈ నెల 23న ఉదయం 9 గంటలకు డ్యూటీకి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి గురువారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పీఎస్‌లో లేదా 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

అనుమతుల్లేని క్లినిక్‌లు సీజ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నడుపుతున్న పలు ఆస్పత్రులను శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి సీజ్ చేశారు. మండల కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న లక్ష్మీప్రసన్న క్లినిక్, రమ్య క్లినిక్‌లను సీజ్ చేశారు. అలాగే ఎలాంటి బోర్డు లేకుండా చంద్రకాంత్ అనే వ్యక్తి నడుపుతున్న మరో క్లినిక్‌ను సైతం మూసేయించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే కట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ అమృత జోసెఫ్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసు, పీహెచ్ఎన్ లుధియా, ఎంపీహెచ్ఓలు మున్వర్, శ్రీనివాసు, రాఘవులు పాల్గొన్నారు.


చౌదరిగూడలో క్లినిక్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

మహాసభలను జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కడ్తాల్: మండల కేంద్రంలో ఆగస్టు 1న మత్స్యకారుల 8వ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు తెలంగాణ మత్స్యకార్మికులు, మత్స్యకార్మిక సంఘం (టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు గొరెంకల నర్సింహ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ తెలిపారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ కమ్యూనిటీహాలులో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి మత్స్య సొసైటీ జలవనరులకు సరిపడేంత ఉచిత చేప పిల్లలకు సంబంధించి నగదును మత్స్యకారుల సొసైటీలో జమచేయాలన్నారు. వర్షకాల సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా నేటికి ఉచిత రొయ్య పిల్లల విషయంలో ప్రభుత్వం ప్రకటన చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చెన్నమోని శేఖర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

అంతా సిద్ధం.. అమ్ముకుంటే ఆదాయం

'రియల్ ఎస్టేట్' బాగానే ఉన్నా అమ్మకాలకు వెనుకంజ

- సర్కార్ పిలుపు కోసం ఎదురుచూపులు
- లే అవుట్‌లు సిద్ధం చేసిన హెచ్ఎండీఏ

ప్రాంతం	మొత్తం ఎకరాల్లో	హెచ్ఎండీఏ ప్లాట్లు	విక్రయించినవి	ప్రస్తుతం ఉన్నవి
లేమూరు	83.47	164	-	164
తొర్రూరు	117.375	885	392	493
కుర్మల్‌గూడ	16.75	145	86	59
బాచుపల్లి	27.36	206	204	2
మేడిపల్లి	53.21	208	91	117 (కొన్ని ప్లాట్లు కోర్టు కేసుల్లో ఉన్నాయి)
మోకిల	165.37	908	189	719 (కొన్ని స్థలాల రిజిస్ట్రేషన్ పెండింగ్‌లో ఉంది)
బుద్వేల్	182.10	17	12	4
ప్రతాప్‌సింగారం	126.12	24	-	24
బహదూర్‌పల్లి	40.00	221	152	69
ఇన్ముల్‌నర్వ	92.69	327	-	-



సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ లే అవుట్‌లలో స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కానీ సర్కార్ నుంచి అనుమతి లభించకపోవడంతో అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఆరు నెలల క్రితమే భూముల విక్రయం ద్వారా ఆదాయాన్ని ఆర్జించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ అప్పట్లో రియల్‌ఎస్టేట్ రంగంలో స్తబ్దత నెలకొనడం వల్ల విరమించుకున్నారు. కొద్ది రోజులుగా 'రియల్' రంగంలో సానుకూల వాతావరణం నెలకొంది. ఇటీవల హౌసింగ్‌బోర్డు స్థలాల అమ్మకాలకు సముచితమైన స్పందన లభించింది. మరోవైపు నగర శివార్లలోని వివిధ ప్రాంతాల్లో నిర్మాణరంగం ఊపందుకుంటోంది. ఈ క్రమంలో హెచ్ఎండీఏ భూములకు సైతం డిమాండ్ బాగానే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కొనుగోలుదారుల ఆసక్తి..

ప్రైవేట్ వెంచర్‌ల కంటే హెచ్ఎండీఏ లే అవుట్‌లలో కొనుగోలు చేసేందుకే ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. రోడ్లు, పారిశుధ్యం, మంచినీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించడం, ఎలాంటి వివాదాలు లేని స్థలాలు కావడంతో సామాన్య, మధ్యతరగతి వర్గాలు మొదలుకుని సంపన్నులు, బిల్డర్‌లు, రియల్టర్లు తదితర అన్ని వర్గాలకు చెందిన వాళ్లు కూడా హెచ్ఎండీఏ భూములను, స్థలాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతారు. గతంలో వివిధ ప్రాంతాల్లో హెచ్ఎండీఏ విక్రయించిన స్థలాలకు భారీ ఎత్తున స్పందన లభించడమే ఇందుకు నిదర్శనం.

కాలయాపన ఎందుకు..

ప్రస్తుతం పలు ప్రాంతాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇన్ముల్‌నెర్వా, లేమూరు, కుర్మల్‌గూడ, తొర్రూరు, ప్రతాప్‌సింగారం తదితర ప్రాంతాల్లో స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కొన్ని చోట్ల హెచ్ఎండీఏ సొంత స్థలాల్లో లేఅవుట్‌లను అభివృద్ధి చేయగా, ప్రతాప్‌సింగారం, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో రైతుల నుంచి సేకరించిన భూములను అభివృద్ధి చేశారు. ఈ వెంచర్‌లలో రైతులకు 60 శాతం ప్లాట్‌లు కేటాయించగా చెందిన మిగతా 40 శాతం స్థలాల్లో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా స్థలాలను విక్రయించవచ్చు. 'ప్రస్తుతం అన్ని విధాలుగా సానుకూలంగా ఉంది. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొంటేనే కొనుగోలుదార్ల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లభిస్తుంది' అని హెచ్ఎండీఏ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. బుద్వేల్, మోకిల వంటి చోట్ల గతంలో హెచ్ఎండీఏ స్థలాలకు భారీ స్పందన లభించింది. ప్రస్తుతం అక్కడ ఇంకా కొన్ని స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కోకాపేట్‌లో ఎకరం రూ.వంద కోట్లకు అమ్ముడైంది. బుద్వేల్‌లోనూ భారీ ఆదాయం లభించింది. వివిధ ప్రాంతాల్లో ఎన్నారైలు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. సొంతింటి కలను సాకారం చేసుకోవాలని ఆశించే మధ్యతరగతి వర్గాలు సైతం హెచ్ఎండీఏ స్థలాలను కొనుగోలు చేశాయి.

కాసులుంటేనే పరుగులు..

సికింద్రాబాద్ నుంచి డెయిరీఫాం, శామీర్‌పేట్ మార్గాల్లో ఎలివేటెడ్ కారిడార్‌లతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్ల నిర్మాణానికి హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. డెయిరీఫాం ఎలివేటెడ్‌కు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లకు టెండర్‌లు కూడా ఖరారయ్యాయి. దీంతో నిధుల కేటాయింపు హెచ్ఎండీఏకు ఒక సవాల్‌గా మారింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న భూములను, ప్లాట్‌లను విక్రయించడం వల్ల కనీసం రూ.5000 కోట్ల వరకు ఆర్జించే అవకాశం ఉంది.

కుంటలో పడి వ్యక్తి మృతి


శంకర్ (ఫైల్)

కొందుర్గు: ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని విశ్వనాథ్‌పూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చాకలి శంకర్(30) శుక్రవారం సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఊరి శివారులోని తుంగకుంటకు వెళ్లి, ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. సమీపంలో ఉన్న వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా బయటకు తీసి షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శంకర్‌కు భార్య మహేశ్వరితో పాటు ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు.

ప్రమాదకరంగా వంతెన

- వెంకిర్యాల వాగులో బోల్తాపడిన డీసీఎం
- బ్రిడ్జి నిర్మించాలని స్థానికుల డిమాండ్


వంతెనను పరిశీలిస్తున్న అధికారులు

కొందుర్గు: వెంకిర్యాల వంతెన నిర్మాణం పనులు అర్ధతరంగా నిలిచిపోవడంతో ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే వాగు ప్రవహించి రాకపోకలు స్తంభించిపోతున్నాయి. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు బారికేడ్లు ఏర్పాటుచేసి రాకపోకలను నిలిపివేశారు. శుక్రవారం ఉదయం కర్ణాటకలోని హుబ్లీ నుంచి కొందుర్గులోని దివ్యశక్తి పరిశ్రమకు ముడిసరుకు తీసుకువస్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి వాగులో బోల్తాపడింది, అదృష్టవశాత్తు డ్రైవర్ శివరుద్రయ్య, క్లీనర్ సదానంద్ ప్రాణాలతో బయటపడ్డారు.

పలుమార్లు హెచ్చరించిన సాక్షి..

వంతెన నిర్మాణానికి పునాదులు తీసి దాదాపు ఏడాది దాటింది. ఈ విషయమై గతంలో సాక్షి పలుమార్లు కథనాలు ప్రచురించినా అధికారుల్లో చలనం కనిపించలేదు. తాజాగా ఈనెల 23న 'వంతెన అంతేనా' శీర్షికతో వచ్చిన కథనంపై స్పందించిన షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య, ఎస్ఐ రవీందర్‌నాయక్ బ్రిడ్జిని పరిశీలించి వాహనాల రాకపోకలను నిలిపివేయించారు. రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా వాగులో బోల్తాపడిన డీసీఎంను ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ గణపతి, పంచాయతీరాజ్ ఏఈ మధు వంతెనను పరిశీలించారు. ఇప్పటికైనా వంతెన నిర్మాణ పనులను చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీసీసీ లీగల్‌సెల్ జిల్లా కన్వీనర్‌గా హనుమంతు


నియామకపత్రం అందుకుంటున్న హనుమంతు

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ధారూరు మండలం అంతారం గ్రామానికి చెందిన భ్యాగారి హనుమంతు పీసీసీ లీగల్‌సెల్ రంగారెడ్డి కన్వీనర్‌గా నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా చైర్మన్ భిక్షమయ్య గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీసీసీ లీగల్‌సెల్‌కు తనవంతు సహకారం అందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ లీగల్‌సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ దేవగౌడ్, రాష్ట్ర కన్వీనర్ కుర్మ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డిపై పీఎస్‌లో ఫిర్యాదు

షాబాద్: హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్ జనార్దన్‌రెడ్డి, పార్టీ నాయకులు గౌరీశ్వర్, ఆంజనేయులు, యాదయ్య తదితరులు ఉన్నారు.


షాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జాతీయ సెమినార్‌లో షాద్‌నగర్‌వాసి


మాట్లాడుతున్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్: హనుమకొండలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సెమినార్ నిర్వహించారు. దీనికి షాద్‌నగర్ పట్టణానికి చెందిన అధ్యాపకుడు డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి రాసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ ఇట్స్ సోషల్ ఎకనామీ ఇంపాక్ట్ ఆన్ ది ఫ్యూచర్ వర్క్ అనే పరిశోధన పత్రం ఎంపికైంది. సెమినార్‌లో పాల్గొన్న డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి తాను రాసిన పరిశోధన పత్రంపై ప్రసంగించారు.

రుణాల పేరిట రూ.1.5 కోట్లు స్వాహా

ఆన్‌లైన్‌లో ప్రచారం చేసి మోసం

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలోని తెల్లాపూర్‌లో ఉంటున్న ఓ వ్యక్తి తాను ముంబైలో ఉంటున్నట్లు ఆన్‌లైన్‌లో ప్రచారం చేసుకున్నాడు. ఫిన్‌పెయిర్ పేరుతో వెబ్‌సైట్ ఏర్పాటు చేసి వ్యాపారాభివృద్ధికి రుణం ఇస్తానంటూ ఎర వేశాడు. నమ్మి ముందుకు వచ్చిన నగర వ్యాపారి నుంచి రూ.1.5 కోట్లు స్వాహా చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడు డి.నాగరాజును అరెస్టు చేసినట్లు డీసీపీ దార కవిత శుక్రవారం వెల్లడించారు. తెల్లాపూర్ రోడ్డులోని హానర్ వివాంటీస్‌లో నివసించే నాగరాజు ఆన్‌లైన్‌లో ఫిన్ పెయిర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థను ఏర్పాటు చేశాడు. దీనికోసం ఓ వెబ్‌సైట్‌ను రూపొందించిన ఇతగాడు అందులో ఇది ముంబై కేంద్రంగా పని చేస్తున్నట్లు పేర్కొన్నాడు. వివిధ రకాలైన వ్యాపారులను వారి వ్యాపారాభివృద్ధి కోసం తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామంటూ ఆన్‌లైన్ వేదికగా ప్రచారం చేశాడు. నగరానికి చెందిన ఓ వ్యాపారి (39) ఆన్‌లైన్‌లో వచ్చిన ఈ ప్రకటన చూసి ఆకర్షితుడయ్యాడు. తనకు రుణం కావాలంటూ ఆ ప్రకటనలో పొందుపరచగా...అది చూసిన నాగరాజు 2023 జూన్‌లో సదరు వ్యాపారిని సంప్రదించాడు. వ్యాపారి పూర్వాపరాలు, రుణం అవసరాలను తెలుసుకున్న నాగరాజు భారీ మొత్తం తక్కువ వడ్డీకి ఇవ్వడానికి అంగీకరించాడు. ఆపై వివిధ రకాలైన రుసుముల పేరు చెప్పి ఆ ఏడాది నవంబర్ నుంచి దశల వారీగా రూ. కోటీ 55 లక్షలు స్వాహా చేశాడు. అప్పటి నుంచి త్వరలో రుణం మంజూరై ఖాతాలో పడుతుందంటూ నమ్మబలుకుతున్నాడు. ఎట్టకేలకు మోసపోయానని తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ కె.సతీష్ రెడ్డి నేతృత్వంలోని బృందం నిందితుడిని అరెస్టు చేసింది. ఇతడు ఇలాంటి నేరాలు ఇంకా ఏవైనా చేశాడా? అనే కోణంలో దర్యాప్తు చేస్తోంది.

ఆర్టీసీ ప్రయాణికులకు శ్రావణ మాసం బొనాంజా

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి విజయవాడ, బెంగళూరు నగరాలకు టికెట్ చార్జీల్లో ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. ఈ మేరకు టికెట్ ధరలు 16 నుంచి 30 శాతం వరకు తగ్గించినట్లు ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు గరుడ ప్లస్ బస్సు టికెట్ ధర రూ.635 నుంచి రూ.444కి, గరుడ క్లాస్ రూ.592 నుంచి రూ.438కి తగ్గించినట్లు పేర్కొన్నారు. రాజధాని ఏసీ రూ.533 నుంచి రూ.448కి, లగ్జరీ సూపర్ క్లాస్ రూ.815 నుంచి రూ.685కి తగ్గించారు. బెంగళూరు మార్గంలోనూ సర్వీసులపై టికెట్ ధరలు తగ్గించారు. సూపర్ లగ్జరీ బస్సు టికెట్ ధర రూ. 946 నుంచి రూ.757కి తగ్గించారు. లహరి ఏసీ స్లీపర్ బస్సుల్లో బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి తగ్గించారు. లహరి ఏసీ స్లీపర్ కమ్ సీటర్ బస్సుల్లో సీటు ధర రూ.1203 నుంచి రూ. 903కి, బెర్త్ ధర రూ.1569 నుంచి రూ.1177కి తగ్గించినట్లు శ్రీలత చెప్పారు. ఈ రాయితీలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్‌లకు కూడా వర్తిస్తాయి. శ్రావణ మాసంలో అధిక ప్రయాణాలు ఉంటాయని, రాయితీలతో ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుందని ఆమె చెప్పారు.

జంట జలాశయాలకు వరద తగ్గుముఖం

సాక్షి, సిటీబ్యూరో: జంట జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుముఖం పట్టింది. ఉస్మాన్ సాగర్ జలాశయంలోకి పరీవాహక ప్రాంతాలైన చేవెళ్ల, వికారాబాద్, శంకర్‌పల్లి, దోమీపేట్ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వరద పూర్తిగా తగ్గింది. హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌కు చేవెళ్ల, అందాపూర్, కొత్వాల్ పేట్, నర్కూడ, తాండూరు, మొయినాబాద్ తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షం నీరు ఈసీ నది ద్వారా జలాశయాలకు చేరుతోంది. ఉస్మాన్‌సాగర్ జలాశయానికి వరద ఆగి పోగా, హిమాయత్ సాగర్ జలాశయానికి మాత్రం 250 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

చిక్కని చిరుత

మణికొండ: పోలీసు గ్రే హౌండ్స్‌లో కనిపించిన చిరుత అటవీ శాఖ అధికారులకు చిక్కడం లేదు. నాలుగు రోజుల నుంచి గ్రే హౌండ్స్‌తో పాటు చిలుకూరు జింకల పార్కులో తిరిగిన చిరుత శుక్రవారం తెల్లవారు జామున ఔటర్ రింగ్ రోడ్డు దాటి సర్వీసు రోడ్డులో ఉన్న ట్రెక్ పార్కు వైపు వచ్చింది. తెల్లవారు జామున 2.30 గంటల సమయంలో ఔటర్‌పై వెళ్తున్న ఓ లారీ డ్రైవర్ దాన్ని చూసి అకస్మాత్తుగా బ్రేక్ వేసి నట్టు అతను అటవీ అధికారులకు తెలిపాడు. దాంతో అటవీ అధికారులు శుక్రవారం ట్రెక్ పార్కులోను రెండు బోన్‌లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. చిరుతపులికి కావాల్సినంత ఆహారం లభిస్తుండటం, వందల ఎకరాల విస్తీర్ణమైన అటవీ ప్రాంతం ఉండటంతో అందులోనే తిరుగుతుందని, దాన్ని పట్టుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామని చిలుకూరు అటవీ రేంజ్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. ఉదయం సమయంలో ట్రెక్ పార్కులోకి వాకింగ్‌కు ప్రజలు రావద్దని, గ్రేహౌండ్స్, చిలుకూరు జింకల పార్కు పరివాహకంలో ఉన్న వారు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు.

డీపీ ఫ్రాడ్‌లో ఇరువురి అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ఓ కంపెనీ ఎండీ ఫొటోను వాట్సాప్ డీపీగా పెట్టి, ఆ సంస్థ ఉద్యోగితో చాటింగ్ చేసి రూ.1.94 కోట్లు స్వాహా చేసిన కేసులో ఇద్దరు నిందితులను సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. నిందితులు మధ్యప్రదేశ్‌కు చెందిన అజయ్ సాహు, ఉత్తరప్రదేశ్ వాసి వైష్ణ అని పోలీసులు ప్రకటించారు.

100 మీటర్ల పరిధిలో 50 లారీల చెత్త

బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

- క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: టోలీచౌకీ సమీపంలోని విరాట్‌నగర్ బుల్కాపూర్ నాలాలో వ్యర్థాల తొలగింపు పనులు నడుస్తున్నాయి. శుక్రవారం 100 మీటర్ల పరిధిలో ఉన్న చెత్తను బయటకు తీయగా దాన్ని ఏకంగా 50 లారీల్లో తరలించాల్సి వచ్చింది. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. నాలాల్లో వరద సాఫీగా సాగేలా చూడాలని సూచించారు. నాలాల్లో ఎక్కడైనా ఆటంకాలు ఉంటే వెంటనే తొలగించాలని, వరద నీరు సాఫీగా సాగితేనే అనేక ప్రాంతాలకు వరద ముప్పు తప్పుతుందని పేర్కొన్నారు. విరాట్‌నగర్‌లోని ఇరుకు సందులో లారీలు వెళ్లేందుకు వీలు లేకపోయినా స్థానికుల సహకారంతో చెత్తను తొలగించే పనులను చేపట్టారు. అడిక్‌మెట్ పరిధిలోని పద్మా కాలనీలో ఇటీవల కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్ పరిసరాలను ఏవీ రంగనాథ్ పరిశీలించారు. ఆరు నుంచి ఎనిమిది మీటర్ల వెడల్పుతో దాదాపు 500 మీటర్ల మేర బాక్సు డ్రైన్ నిర్మించి, పైన వాహనాల రాకపోకలకు అవకాశం కల్పించాలని అక్కడి స్థానికులు హైడ్రా కమిషనర్‌ను కోరారు. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలా విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు.